5_5.qxd 2/25/2026 12:25 AM Page 1



# థాంక్యూ సిఎం సారూ...

- మార్కాపురం జిల్లా సాధనలో కీలక నేతగా కందుల నారాయణరెడ్డి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనకు ఘన స్వాగతం ...
- కృతజ్ఞత సభ ఏర్పాట్లు



**మార్కాపురం, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

మార్కాపురం నూతన జిల్లాగా ప్రకటించిన అనంతరం తొలిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం విచేయనున్న నేపథ్యంలో పట్టణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతగా స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.ఊరంతా పసుపుమయం కాంతులీనుతూ స్వాగత ద్వారాలు, బ్యానర్లు,ఫ్లెక్సీలు అలరారుతున్నాయి.జిల్లా సాధనలో నిరంతర పోరాటం మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలనే ప్రజల దీర్ఘకాల డిమాండ్ సాధనలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ వేదికగా,పార్టీ సమావేశాల్లో, ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ప్రాంత ప్రజల ఆకాంక్షలను బలంగా వినిపించినట్లు చెబుతున్నారు. భౌగోళిక విస్తీర్ణం,అభివృద్ధి అవకాశాలు, పరిపాలనా సౌలభ్యాన్ని వివరిస్తూ ప్రత్యేక జిల్లాగా మారితే ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని సమగ్ర నివేదికలు సమర్పించినట్లు సమాచారం.స్థానిక ప్రజా సంఘాలు,వ్యాపార వర్గాలు,విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమాత్మక కార్యక్రమాలు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని ఏకీకృతం చేయడంలో ఆయన పాత్ర విశేషమని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.అభివృద్ధి లక్ష్యాలతో ముందడుగుజిల్లా ఏర్పాటుతో పరిపాలన వికేంద్రీకరణ సాధ్యమై, ప్రభుత్వ సేవలు గ్రామీణ ప్రాంతాలకు వేగంగా అందుతాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంగా మారిన మార్కాపురంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాల స్థాపన, రహదారుల విస్తరణ,విద్యా-ఆరోగ్య రంగాల పురోగతి వంటి అంశాలు వేగవంతంఅవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కృతజ్ఞత సభకు భారీ ఏర్పాట్లుముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అన్ని మండలాల నుంచి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సభా ప్రాంగణంలో తాగునీరు, పార్కింగ్, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకదృష్టి సారించినట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రజల కృతజ్ఞతల వెల్లుమార్కాపురం జిల్లా సాధనతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.ఇది ప్రాంత చరిత్రలో మైలురాయి" అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా సాధనలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నాయకత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.మొత్తానికి, మార్కాపురం జిల్లాసాధనతో అభివృద్ధి కొత్తదిశగా సాగుతుందనే నమ్మకంతో ప్రజలు ఎదురుచూస్తుండగా,ముఖ్యమంత్రి పర్యటనతో ఆ ఉత్సాహం మరింత రెట్టింపైంది.ఊరంతా పసుపుమయం అవుతూ చారిత్రాత్మక స్వాగతానికి సిద్ధమవుతోంది.

## సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన బందోబస్తు

- 1200 మందికి పైగా పోలీసు సిబ్బంది మోహరింపు
- ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు





**మార్కాపురం, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

జిల్లాలో జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో మార్కాపురం జిల్లా పోలీసుశాఖ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసింది.దోర్నాల మండలం లోని సొరంగాల నుంచి సాగర్ జలాశయానికి నీటిని తరలించే ఫీడర్ కెనాల్ శంకుస్థాపన కార్యక్రమం,అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభ దృష్ట్యా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు మంగళవారం బందోబస్తు విధుల్లో పాల్గొననున్న అధికారులకు ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించా లని ఎస్పీ ఆదేశించారు.హెలిప్యాడ్, సభా వేదిక, వీఐపీ రూట్, గ్యాలరీలు, ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సభ ప్రాంగణంలోకి వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాన్వాయ్ ట్రయల్ రన్ పర్యవేక్షణ...... పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు సీఎం కాన్వాయ్ రాకపోకల మార్గంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక పోలీసు బృందాలు, బాంబ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీలు ముందస్తు తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు నిర్వహించిన కాన్వాయ్ ట్రయల్ రన్‌ను స్వయంగా పర్యవేక్షించి అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు.సభకు హాజరయ్యే ప్రజలు, అధికారులు తమ వాహనాలను నిర్ణయించిన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని సూచించారు. సాధారణ ప్రజల వాహనాలకు ఎల్.వి. ప్రసాద్ హాస్పిటల్ ఉత్తర వైపు, కాశీనాయన టెంపుల్ సమీపం, ఇందిరమ్మ కాలనీ-తర్లపాడు రోడ్ ప్రాంతాలు కేటాయించగా, ప్రభుత్వ వాహనాలకు శ్రీ సాయి బాలాజీ స్కూల్ ఉత్తర వైపు, వీఐపీ వాహనాలకు అదే స్కూల్ దక్షిణ వైపు పార్కింగ్ ఏర్పాటు చేశారు.ఈ బందోబస్తు నిమిత్తం 2 అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 సీఐలు, 90 మంది ఎస్ఐలతో పాటు మొత్తం 1162 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఏఆర్, ఏపీఎస్పీ సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసు శాఖ విధించిన నిబంధనలు ప్రజలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి సిరులు కురిపించేందుకు విచ్చేస్తున్న అపర భగీరధుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి హృదయ పూర్వక సాదర స్వాగతం సుస్వాగతం - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న అపరభగీరధుడు బాబుకి స్వాగతం-సుస్వాగతం భగీరధుడు గంగను భూమి మీదకు తెచ్చినట్టు మన పురాణాలు చెబుతుంటే గోదావరి- కృష్ణా నదులను అనుసంధానం చేసి, గోదావరి జలాలను కృష్ణాకు మళ్లించిన అపర భగీరధుడు మన చంద్రన్న ప్రకాశం జిల్లాలోని కరువు నేలపై జల సిరులు కురిపిస్తున్న చంద్రబాబుకు మా కృతజ్ఞతాభినందనలు.వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని వెనుకబడిన దొనకొండ ప్రాంతానికి పారిస్తూ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్న అపర భగీరధుడు చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు. ఎన్నో ఏళ్ళుగా కరువు కోరల్లో అల్లాడుతున్న దర్శి నియోజకవర్గ ప్రజల సాగు, తాగునీరు కష్టాలు. చంద్రబాబు నాయుడు విజనరీ లీడర్ షిప్‌కు ఇదే తార్కాణం.

# అలుపెరుగని పోరాటాలు

**మార్కాపురం, ప్రభాతవార్త**

**అధికారంలో ఉన్న లేకపోయినా పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం అలుపెరగని పోరాటాలు సాగించారు.భవిష్యత్తు తరాల బ్రతుకులు ప్రశ్నార్థకంగా మారకూడదని సంకల్పంతో నిరంతర పోరాటాలకు యోధుడిగా నిలిచారు.కరువు కాటకాలతో అలమటించిపోతున్న పశ్చిమ ప్రాంతంలో కృష్ణా జలాలు పారి ప్రజలు సుఖజీవనం సాగించా లన్నదే ఆ ప్రజా ప్రతినిధి సంకల్పం.. వెలిగొండ ప్రాజెక్టు రెండవ టన్నెల్ వ్యాసార్థం 7.5 వ్యాసార్థం వల్ల జరిగే నష్టం పై పోరాటానికి శ్రీకారం చుట్టారు.**

- వెలుగొండ రెండవ టన్నెల్ వ్యాసార్థం పెంపుదలలోనూ
- మార్కాపురం జిల్లా సాధనలోనూ కీలక పాత్ర...
- పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే కందుల నిరంతరం తపన

భవిష్యత్తు తరాల బ్రతుకులు అంధకారములోకి నెట్టి వేయడమేనని రెండువ టన్నుల వ్యాసార్థం 9.5కు పెంచాల్సిందేనంటూ ఉద్యమానికి శ్రీకారం చుట్టి సత్ఫలితాలు సాధించిన భగీరథుడు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి.అటు వెలుగొండ ప్రాజెక్టు రెండో టన్నుల వ్యాసార్థం పెంపుదల్లోనూ, మార్కాపురం జిల్లా సాధన లోనూ ముఖ్య భూమిక పోషించి చరిత్ర పుటల్లో నిలిచిపోయారు..పలకల పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించిన కందుల పశ్చిమ ప్రాంత అభివృద్ధికి అభివృద్ధి కోసం రాజకీయ రంగ ప్రవేశం చేశారు.2009లో ఎమ్మెల్యేగా గెలుపొంది కందుల నారాయణరెడ్డి తాను రూపొందించుకున్న ప్రణాళిక మేరకు పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం సాగించారు.ఆర్థికంగా, రాజకీయంగా,సామాజికంగా అన్ని రంగాల్లో పూర్తి గా వెనుకబడిన మార్కాపురం ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముందుకు సాగుతున్నారు.వర్షాధారం తప్ప ప్రత్యామ్నాయం ఏ మాత్రం లేని పశ్చిమ ప్రాంత వరప్రసాదమైన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈయన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారు.నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రెండవ సొరంగ 7.5 వ్యాసార్థం (డయా మీటర్లు)తో నిర్మాణపనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంకాగా ఈ వ్యాసార్థంతో జరిగే నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెలిగొండ రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు నింపాలంటే వరద నీరు 40 రోజులు గడువు పడుతుందని, ఇన్ని రోజుల పాటు వరద నీరు రావాలంటే కష్టసాధ్యమని ఎట్టి పరిస్థితుల్లో వ్యాసార్థం 9.5 పెంచడం ద్వారా 40 రోజుల





పాటు వచ్చే నీటితో రిజర్వాయర్ నింపవచ్చని నీటి పారుదల నిపుణులు అంచనా వేశారు.నిపుణుల సలహా మేరకు కందుల నారాయణరెడ్డి రెండో సొరంగ నిర్మాణ వ్యాసార్థ్యాన్ని 7.5 నుంచి 9.5కు పెంచాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆ నాడు మార్కాపురం నియోజక వర్గంలో పాద యాత్ర చేపట్టి ప్రజల మద్దతు ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు.ఈ పాదయాత్రకు పార్టీలకు, వర్గాలకు అతీతంగా ఆనాడు జరిగిన ఉద్యమంపై ప్రభుత్వం స్పందించి 9.5 కు రెండో టర్నల్ వ్యాసార్థం పెంచడం జరిగింది అన్ని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.దీంతో దీంతో నాటి వైయస్సార్ ప్రభుత్వం దిగివచ్చి రెండో సొరంగ నిర్మాణ వ్యాసార్థం పెంపుదలలో కందుల విశేష కృషి చేశారు.వైసిపి ప్రభుత్వ హయాంలో పోరాటాలు కొనసాగిస్తూనే మరోవైపు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పటి కప్పుడు కప్పుడు ప్రాజెక్టు నిర్మాణ పనుల అవశ్యకత గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పనుల పురోభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు.అనేక దశాబ్దాలుగా వెనుకబడిన పశ్చిమ ప్రాంతాన్ని మార్కాపురం జిల్లా ప్రకటించాలని కోరుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఎత్తున నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు ఉద్యమించిన ప్రజల మనోభావాలను అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిగణలోకి తీసుకోలేదు.జిల్లా సాధనతోనే పశ్చిమ ప్రాంత ఏనుగుబాటును రూపుమాపవచ్చని భావించిన కందుల నారాయణరెడ్డి ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు అయితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజల ఆకాంక్షల మేరకు మార్కాపురం జిల్లా ఇస్తానని ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది.ఆ హామీ మేరకు చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే మార్కాపురంజిల్లాను మంజూరు చేయడం జరిగింది.మార్కాపురం జిల్లా ఏర్పాటులోనూ,పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగ నిర్మాణ వ్యాసార్థం పెంపుదలలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కృషి ప్రశంసనీయమని ఆ పార్టీ నాయకులతో పాటు ప్రజలు భావిస్తున్నారు. అటు జిల్లా సాధనలోనూ, ఇటు వెలిగొండ ప్రాజెక్టు రెండవ వ్యాసార్థం పెంపుదలలోనూ ముఖ్య భూమికను పోషించిన కందుల నారాయణరెడ్డి చరిత్ర పుటల్లో నిలిచిపోయారు.పశ్చిమ ప్రాంత అభివృద్ధి





కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అఖిల పక్ష కమిటీ 60 రోజుల పాటు పెద్ద ఎత్తున ప్రదర్శనలు,ధర్నాలు,చివరకు దీక్షలు కూడా చేపట్టడం జరిగింది. పశ్చిమ ప్రాంత కేంద్రంగా మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయాలని పెద్ద కోసం అలుపెరగని పోరాటాలు చేసి ఫలితాలు సాధించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పవచ్చు.

## మార్కాపురం ముఖ్యమంత్రి బహిరంగ సభకు జనం ప్రభంజనమై కదులుదాం

**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా ఏర్పాటు జిల్లాలోని ప్రజలకు వరమని, వెలుగొండ పూర్తితో జిల్లా ప్రాంత ప్రజల కల సాకారం చేసిన మహానేత చంద్రబాబు నాయుడు అని అందుకే ప్రజలు స్వచ్ఛందంగా చంద్రబాబు సభకు తరలి వచ్చేందుకు సన్నద్ధం అవుతున్నారని గుంటూరు మిర్చి యార్డు చైర్మన్, సీఎం సభ పరిశీలకులు కుర్రా అప్పారావు అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో కుర్రా అప్పారావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో జరిగిన చర్చ గోష్టిలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటనకు, ప్రజలు విరివిగా పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో ప్రజలు స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి సభకు బయలుదేరడానికి ఉత్సాహం చూపిస్తున్నారని, మండలంలో ప్రజల స్పందన చూస్తే చంద్రబాబు ఈ 18 నెలల కాలంలో చేసిన అభివృద్ధి పనులకు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మార్కాపురం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి చంద్రబాబు మార్క్ అభివృద్ధికి మార్కాపురం జిల్లానే నిదర్శనం అని పేర్కొన్నారు. అదే విధంగా మిర్చి రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎల్లవేళలా ప్రభుత్వం తరుపున



అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరిసుబ్బారావు,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంగళరెడ్డి,క్లస్టర్ ఇన్‌చార్జిషేక్ మస్తాన్‌వలి,మాజీఎంపీపీ మంత్రు నాయక్, తెలుగు యువత నాయకులు వేగినాటి శ్రీను, బీజేపీ మండలఅధ్యక్షులుమాదాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

## మార్కాపుం సభ విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు

- చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పీసీపల్లిలో సమీక్ష సమావేశం

**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మార్కాపురం నూతన జిల్లా ఏర్పాటు,వెలిగండ్ల ప్రాజెక్టు సందర్శనార్థం నేడు విచ్చేయనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయడానికి పీసీపల్లి మండలంలో మంగళవారం కీలక సమావేశం జరిగింది. మార్కాపురంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు జనసమీకరణ, వాహన సదుపాయం, భోజన ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరువతో ఈ సమావేశానికి ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ లక్ష్మీ శాంతి హాజరయ్యారు. పీసీపల్లి మండల పార్టీ అధ్యక్షుడు వేమూరు రామయ్య ఆధ్వర్యంలో మండల క్లస్టర్లు పులి ప్రతాపరెడ్డి, ఏనుగంటి నాగేంద్రబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. మార్కాపురం నూతన జిల్లా ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమం, అలాగే వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయుచున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయడానికి ప్రతి గ్రామం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేలా కార్యచరణ రూపొందించారు. సభ ప్రాంగణంలో తగిన వసతులు కల్పించడంతో పాటు రవాణా, భోజన ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా బాధ్యతలను నాయకులకు కేటాయించారు.పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేసి సభను చారిత్రాత్మక విజయవంగా నిలపాలని నాయకులు పిలుపునిచ్చారు.





6_6.qxd 2/25/2026 12:18 AM Page 1



## నూరుశాతం పన్నులు వసూళ్లకు నడుం బిగించండి



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ ఆదేశాల మేరకు నూరుశాతం ఇళ్ల పన్నులు వసూళ్లకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు కోరారు. సంతనూతలపాడు గ్రామపంచాయతీలో మంగళవారం నాడు జరిగిన ఇళ్ల పన్నులు వసూళ్ల ప్రక్రియపై సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 15వ తేదీ నాటికి ఈ పన్నులు వసూళ్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇళ్ల పన్నులు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేసిన ప్రజలకు నోటీసులిచ్చి వారి ఆస్తులు జప్తుకు చర్యలు చేపట్టనున్నట్టు పంచాయతీ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. సంతనూతలపాడులో గ్రామస్తులు ప్రత్యేకంగా ఇళ్ల పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి నడుంబిగించాలని శ్రీనివాసులు ఈ సందర్భంగా కోరారు. యుఎఫ్ఎస్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.ఈ సర్వే నెల 27వ తేదీలోపు నిలుపుదల చేయుచున్న సందర్భంగా సచివాలయ సిబ్బందినూరుశాతం ప్రగతిని సాధించాలన్నారు.ఈ సమావేశంలో పంచయతీ బిల్‌కలెక్టర్ పి.బాబురావు ,జూనియర్ అసిస్టెంట్ వై.మణి,సంతనూతలపాడు1,2 సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ పంట నమోదును పరిశీలించిన ఏవో పావని



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలంలోని రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంను మంగళవారం నాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని, వ్యవసాయ బృందం నిర్వహించారు.ఈకార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని మాట్లాడుతూ సూపర్ చెక్ తనిఖీ నిమిత్తం ఈ గ్రామాల్లో 2025-26 రబీ సీజన్లో గ్రామ వ్యవసాయ సహాయకులు చేసిన ఈ పంట నమోదును పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ పంట నమోదు యాప్‌లో రైతు సాగు చేసిన పంటల వివరాలు, అదే రైతుకి సంబంధించి క్షేత్ర స్థాయిలో రైతు సాగు చేసిన పంట పేరు, సర్వే నెంబరు, విస్తీర్ణం తదితర వివరాలు ఒకే విధంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. శనగ, కంది, కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభం కానున్నట్లు ఆమె తెలిపారు. కావున క్వింటా శనగ పంట ప్రభుత్వ మద్దతు ధర రూ.5875, కంది పంట ప్రభుత్వ మద్దతు ధర రూ.8000 ఉందని ఏవో తెలియజేశారు. రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోదలచినట్లయితే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అందుకోసం ప్రతి రైతు తమ సమీపంలోని రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించి సీఎం యాప్ నందు, పొం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, వివరాల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో పావని వెల్లడించారు. అదే విధంగా ఇంకా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా మిగిలి ఉన్న రైతులు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాలలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఫార్మర్ రిజిష్టర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని యూనిక్ ఐడీ నెంబర్ పొందినట్లయితే, తద్వారా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదలగు వ్యవసాయ శాఖ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కేవి సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.బాలసుబ్రహ్మణ్యం, డి.సాయి కృష్ణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నూరుశాతం మేరకు వివిధ రుణాల పక్రియకు చర్యలు చేపట్టాలి



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

సీఐఎఫ్, స్త్రీ నిధి ఉన్నతి పథకాలలో నూరుశాతం రికవరీకి చర్యలు గైకొనాలని సంతనూతలపాడు మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు పేర్కొన్నారు. సంతనూతలపాడులోని మండల వెలుగు కార్యాలయంలో మంగళవారం నాడు జరిగిన మండల మహిళా సమైక్య షెడ్యూల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి.మేరిమ్మ అధ్యక్షత వహించారు. మహిళా సభ్యులు తీసుకున్న రుణాలు నూరుశాతం రికవరీ చేయించాలని ఏపీఎం బాబురావు పేర్కొన్నారు. ఈ నారిల ద్వారా జరిగే సభ్యుల ఇన్కమ్ సర్వే సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. వీవో సమావేశాలు రెగ్యులర్‌గా జరిపి జెండర్, హెల్త్ అంశాలపై మహిళా సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. వీఓ సీబీఐ ఆన్‌లైన్ అకౌంటింగ్, ఈనెలకు పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో మండల మహిళా సమైక్య సెక్రటరీ కే.పద్మావతి, వెలుగు సీసీలు పి.రామాంజనేయులు, సీహెచ్‌శ్రీనివాసులు,ఎన్.చెంచులక్ష్మి, వి.శ్రీనివాసులు,మహిళా సమైక్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## యుఎఫ్ఎస్ సర్వే పక్రియను వేగవంతం చేయాలి



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేని వేగవంతం చేయాలని సంతనూతలపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రవికుమార్ సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టిసిపేషన్ నీడ్స్ సర్వే,సిటిజన్ ఈకేవైసీని ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రవికుమార్ పేర్కొన్నారు.ప్రజలకు అన్ని రకాల సేవలను సత్వరమే అందించాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఇంటి పన్నులను ప్రజలు సత్వరమే చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. శానిటేషన్ పక్రియకు నడుంబిగించాలన్నారు.

## హాకీ ఆంధ్రప్రదేశ్ డైరక్టర్ నిరంజన్ రెడ్డికి మైనంపాడులో క్షీరాభిషేకం



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

హాకీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి 50 సంవత్సరాల పాటు ఎనలేని కృషి చేసిన హాకీ ఆంధ్రప్రదేశ్ డైరక్టర్ ఎం.నిరంజన్ రెడ్డి సేవలను గుర్తు చేసుకుంటూ మంగళవారం నాడు సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఏ.సుందరరామిరెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుందర్ రామిరెడ్డి మాట్లాడుతూ హాకీ ఆంధ్రప్రదేశ్‌కి ఎనలేని కృషి చేసిన హాకీ క్రీడాకారుల జీవితాలలో వెలుగు నింపిన నిస్వార్థ హాకీ సేవకులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు హాకీ క్లబ్ అధ్యక్షులు గొడుగు కాలేశా, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్, రవి, హాకీ క్లబ్ మైనంపాడు, హాకీ క్లబ్ గోనుగుంట, హాకీ క్లబ్ ఒంగోలు సభ్యులు, క్రీడాకారులు పీడీలు పాల్గొన్నారు. హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తిరుమలశెట్టి రవికుమార్ దీనిని పర్యవేక్షించారు.

## నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగ సభను జయప్రదం చేయండి



**పుల్లలచెరువు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

నేడు మార్కాపురం జిల్లాలో జరిగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బహిరంగ సభను జయప్రదం చేయాలని పుల్లలచెరువు మండల టీడీపీ మండల కన్వీనర్ పోట్ల గోవిందు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం ఎలా జరుగుతుంది. త్వరగా వెలుగొండ ప్రాజెక్టు నిర్మించాలన్న సంకల్పంతో, మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేస్తున్న సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భారీ బహిరంగ సభకు, యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు పుల్లలచెరువు మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, గ్రామ గ్రామాన ప్రజలందరూ తెలియజేసి బుధవారం 11గంటల కల్లా మార్కాపురం జిల్లాలో భారీ బహిరంగ సభకు తరలిరావాలని, మండలంలోని టీడీపీ కుటుంబ సభ్యులందరిని ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు.

## నేడు లింగసముద్రంలో విద్యుత్ సరఫరా నిలిపివేత



**లింగసముద్రం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

లింగసముద్రం మండల కేంద్రం లింగసముద్రం, వెంగళాపురం ఏజిపాడు ఈ మూడు ఫీడర్లకి ఆర్డిఏసెస్ వర్క్ వలన నేడు బుధవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ నిలిపివేయబడునని, కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ ఏఈ షేక్ ఫిరోజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పన్నులను నూరుశాతం వసూళ్లు చేయాలి



**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

ఇంటి పన్నులను నూరుశాతం వసూళ్లు చేయాలని ఎంపీడీవో వై.శంకరరావు సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం వలేటివారిపాలెం మండల పరిధిలోని స్వర్ణ గ్రామం కాకుటూరును ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వై.శంకరరావు మాట్లాడుతూ ప్రజలకు పన్నులు కట్టే అవగాహన కలిగించి పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ బస్టాండ్ వార్షికోత్సవం



**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

ఉప్పుగుండూరులో తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించిన బస్టాండ్ 7వ వార్షికోత్సవం మంగళవారం రాత్రి గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన ఎన్టీఆర్ బస్టాండ్ నిర్మించి ఏడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామ టీడీపీ అధ్యక్షులు కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బస్టాంట్ విద్యుత్ అలంకరణ చేసి ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఒంగోలు ఆర్టీసీ డిపో నుండి ఉప్పుగుండూరు మీదుగా హైదరాబాద్‌కు స్లీపర్ కోచ్‌తో పాటుగా జిల్లా కేంద్రమైన ఒంగోలు నుండి ఉప్పుగుండూరు మీదుగా రాష్ట్ర రాజధాని అయిన అమరావతికి కూడా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించే విధంగా స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ ద్వారా ఈ సౌకర్యాలను సాధించుకుందామని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోంద్రు ఆశీర్వాదం, బాపట్ల పార్లమెంటరీ ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సొసైటీ డైరక్టర్లు మసిముక్కు భాస్కరరావు, పెంట్యాల శ్రీనివాసరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కూతంబాకం సెల్వం, మండల టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పొట్లూరి నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం నాయకులు గోగినేని రమేష్, సాధినేని ఆంజనేయులు, బెల్లం శ్రీనివాసరావు, నల్లూరి భాస్కరరావు, రాఘవయ్య, మండల టీడీపీ కార్యదర్శి గద్దల రమేష్, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పిన్నక శ్రీకాంత్, నియోజకవర్గ నాయకులు కోంద్రు దాసు, శవనం వసంతరావు,సుబ్బయ్య,అచ్చయ్య, బెల్లం హరిబాబు, తేలప్రోలు శ్రీరాములు,కోడూరి ప్రభాకర్, కందుల బాలయ్య, సుబ్బారావు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామాయణంపై పోటీ పరీక్షలు



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద విద్యాపీఠం నందు విద్యార్థిని, విద్యార్థులకు రామాయణంపై మంగళవారం పోటీ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడిశెట్టి వీరారావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక గ్రంథాలపై నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొనడం వలన విద్యార్థుల్లో అవగాహన పెంపొందుతుందన్నారు.అనంతరం పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దుర్గా వాహిని, గోళ్ళఅపర్ణ, వివేకానంద విద్యాపీఠం సెక్రెటరీ ఎలుగూరి ప్రసాద్, ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, రమేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### జోము కాలువ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య




**దర్శి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

దర్శిమున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా జోము కాలువ పనులను మంగళవారం పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఇన్‌చార్జి కమీషనర్ శ్రీరామమూర్తి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్శి మున్సిపాలిటీపరిధిలోఅభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఇప్పటికే అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలు కూడా తొందరగా పూర్తి చేయడం జరుగుతుందని దర్శిని సుందరవణంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏడేళ్ల ఆశ.. ఆపదలో ఆపన్నహస్తం

- శిశువు ప్రాణాలకు అండగా ఎమ్మెల్యే ఏలూరి
- అత్యవసర చికిత్సకు సీఎంఆర్ఎఫ్ రూ.3.02 లక్షలు
- మరో రూ.50వేలు సొంత సహాయం
- కుటుంబానికి భరోసాగా నిలిచిన సేవామూర్తి 'సాంబన్న'



**మార్టూరు, ఫిబ్రవరి 24, ప్రబాతవార్త**

ప్రజల కష్టసుఖాల్లో ముందుండే నాయకత్వం అంటే ఏమిటో మరోసారి చాటి చెప్పారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆర్థికంగా బలహీనమైన కుటుంబానికి చెందిన చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు ఆర్థిక స్థోమత లేక దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మానవీయ కోణంలో స్పందించి సేవాభావానికి నిదర్శనంగా నిలిచారు. ఇంకొల్లు మండలం ఇంకొల్లు గ్రామానికి చెందిన షేక్ చాందిని వైసీపీ వాలంటరీగా సేవలందించిన మహిళ. ఆమె భర్త పటాన్ మహబూబ్ జానీ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వివాహమైన ఏడేళ్ల తర్వాత పాపకు జన్మనిచ్చారు. అయితే తల్లి షుగర్ సమస్యతో బాధపడటం వల్ల పాపకు కూడా జన్మనిచ్చిన కొద్ది కాలంలోనే షుగర్ ఎటాక్ వచ్చింది. అలాగే గుండెలో రంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. తక్షణ కార్పొరేట్ చికిత్స అవసరమని చెప్పడంతో కుటుంబం తీవ్ర ఆందోళన చెందింది. ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉండటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. కొందరు దాతలను ఆశ్రయించారు. సోషల్ మీడియాలో విషయాన్ని వెల్లడించారు. కొందరు మంచి మనస్సున్న ఎమ్మెల్యే సాంబశివరావుకువాట్సప్ ద్వారా సమాచారం అందించారు. మెసేజ్‌కు స్పందించిన ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి పాపకు వైద్యం ఆలస్యం కాకూడదు అని ఆదేశించారు. మొదట తన వంతుగా రూ.50వేలు సొంత నిధులను పంపించి , స్థానిక నాయకులు నాయుడు హనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావుల చేతుల మీదుగా కుటుంబానికి అందజేశారు. అక్కడితో ఆగకుండా గుంటూరులోని రామకోటయ్య పిల్లల ఆసుపత్రి వైద్యులను క్యాంపు కార్యాలయ బృందం 22వ తేదీ సంప్రదించింది. అలాగే పాపకు అవసరమయ్యే వైద్యానికి సంబంధించి ఎస్టిమేట్ కాపీని ఇవ్వాలని కోరారు. 23వ తేదీ వైద్యులు ఎస్టిమేట్ ను అందజేశారు. వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అవసరమైన మొత్తం మంజూరు చేస్తాం, వెంటనే చికిత్స ప్రారంభించండి అని ఎమ్మెల్యే ఏలూరి వైద్యులకు స్పష్టంగా సూచించారు. మంగళవారం చిన్నారి వైద్యానికి అవసరమయ్యే మొత్తాన్ని సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3,02,598లను మంజూరు చేయించి అందజేశారు. పాప ప్రాణాలను కాపాడేందుకు ఎమ్మెల్యే తీసుకున్న చొరువ స్థానికులను కదిలించింది. ప్రజల మధ్యే ఉండి సమస్యలు తెలుసుకుని వెంటనే స్పందించడం ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకతగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఏలూరి ఉన్నారనే నమ్మకం మాకు ధైర్యం ఇస్తోందని బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమై తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, కరి శ్రీనివాసరావు, వలేరు మార్క్, రఫీ, వడ్లమూడి సాంబయ్య, బోడెంపూడి సుబ్బారావు, కామేపల్లి హరిబాబు, ముస్లిం మైనార్టీ నాయకులు ఆరిఫా, మస్తాన్ బాబా, ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ యూనివర్శిటీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఉమెన్ సమ్మిట్ కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మహిళలు తమ శక్తిని తక్కువ అంచనా వేసుకోకూడదు వచ్చిన ప్రతి అవకాశాన్ని అంది పుచ్చుకొని ముందుకు వెళ్లాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పిలుపునిచ్చారు. మంగళవారం గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ ఉమెన్ సమ్మిట్ కార్యక్రమంలో దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక స్వావలంబన, రాజకీయాల్లో మహిళల పాత్ర వంటి కీలక అంశాలపై ఆమె సవివరంగా మాట్లాడారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అపారమని, ప్రతి మహిళ తనలోని ప్రతిభను గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆమె ప్రేరణనిచ్చారు. నేను ఒక డాక్టర్ గా వేలాది కుటుంబాలతో పని చేసిన నా స్వయం అనుభవంతో ప్రజల మనోభావాలు తెలుసుకున్న ఒక మహిళ ప్రతినిధిగా మీ ముందుకు వచ్చి ధైర్యంగా మాట్లాడగలుగుతున్నాను. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కల్తీ పాలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది

- కైపు వెంకట కృష్ణారెడ్డి



**దర్శి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

దేశంలోనే ప్రజల మరణాల విషయంలో రోజు రోజుకు ముందుకు దూసుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కాంగ్రెస్ పార్టీ విన్నపం. ఖాళీగా ఉన్న హోం మంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి, కార్మిక శాఖ మంత్రిపదవులను త్వరగా పూర్తి చేయాలి ఎందుకంటే ఇప్పుడున్న వాళ్ల పేరుకే మంత్రులు వాళ్ల వల్ల ఒరిగిందేమి లేదు అని దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కైపు వెంకటకృష్ణారెడ్డి అన్నారు. ఈ కల్తీ పాల సమస్య ఒక్క రాజమండ్రిలోనే కాదు రాష్ట్రం నలుమూలల జరుగుతుంది. కల్తీ పాల ఉత్పత్తి మీద కూటమి ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలి. రైతుల దగ్గర నుంచి వెళ్ళిన పాలు ఎక్కడికెక్కడికి వెళ్తున్నాయి ఆ పాలని ఏ విధంగా అమ్ముతున్నారు అనే విషయం మీద కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక టీం ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలి ఇది కాంగ్రెస్ పార్టీ ప్రధాన మైన డిమాండ్ అని అన్నారు. ఈ కల్తీ పాల వల్ల కిడ్నీ సమస్యలు వచ్చి ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు.

## వరి పొట్టు లారీ బోల్తా.. ఇరువురికి గాయాలు



**బల్లికురవ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

అద్దంకి నార్కట్‌పల్లి రహదారిలో మండలంలోని వైదన వద్ద సోమవారం రాత్రి వరిపొట్టు లారీ పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్ర మత్తు ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. స్వల్ప గాయాలతో ప్రమాదం నుండి బయటపడ్డ డ్రైవర్, క్లీనర్ బతుకు జీవుడా అంటూ వైద్యశాల బాట పట్టారు.

## సీఎం చంద్రబాబు సభకు తరలిరండి

- ఇంటింటికి తిరిగి ప్రజలను ఆహ్వానిస్తున్న టీడీపీ నేతలు



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేడు అనగా బుధవారం వెలిగండ్ల ప్రాజెక్టు సందర్శనకు విచ్చేస్తున్న నేపథ్యంలో మార్కాపురంలో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి సీఎం సభకు భారీగా తరలి రావాలని ప్రజలను ఆహ్వానిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి మువ్వా రంగ సాయి యాదవ్, మండల యూనిట్ ఇన్‌చార్జి దేవిరెడ్డి రాజారామిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు చీకటి వెంకట సుబ్బయ్య, టీడీపీ మండల ఉపాధ్యక్షులు కోటపాటి శేషయ్య, మండల ఎస్సీ సెల్ కత్తి తిరుపాలు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు బహిరంగ సభకు భారీగా తరలిరండి

- టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేడు అనగా బుధవారం వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో మార్కాపురంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి టీడీపీ శ్రేణులకు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

### క్రమశిక్షణతో కూడిన సాధనతో క్లిష్టమైన లక్ష్యాలు చేరువవుతాయి - ఇంద్ర



**వెలిగండ్ల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

క్రమశిక్షణతో కూడిన సాధన ద్వారా క్లిష్టమైన లక్ష్యాలను సైతం అలవోకగా అందుకోవచ్చు అని నవీన్ నిరూపించాడని తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంఆవరణలో ఇటీవల గ్రూపు-2 లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించిన మండలంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న చెవుల నవీన్‌ను మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- మాతాశిశు సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేయండి
- అంగన్‌వాడీ సమావేశంలో సీడీపీఓ ఉషారాణి



**కందుకూరు ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

మహిళాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కందుకూరు సీడీపీవో ఉషారాణి తెలిపారు.మంగళవారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో కందుకూరు, వలేటివారిపాలెం మండలాలలోని సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆమె ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు.ఆయా కేంద్రాల నిర్వహణ కు సంబందించిన గత నెల నివేదికలను కార్యకర్తలు సమర్పించారు.విధివిధానాలను సమీక్షించారు.ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లిపిల్లల సంక్షేమానికి ప్రభుత్వం వివిదపథకాల అమలుచేస్తుందన్నారు.ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుందన్నారు.ఇందులో బాగంగా అంగన్‌వాడీకేంద్రాలకు మాతాశిశువుల సంరక్షణకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటల ద్వారా పూర్వప్రాథమిక విద్యాబోధన నిమిత్తం అనేక సంక్షేమకార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు.వీటిని చిత్తశుద్ధి,అంకితభావంతో లబ్దిదారులకు అందించాలని ఆమెఅంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తిచేశారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్సు లక్ష్మీదేవి,నీలాంబరితోపాటు వివిద గ్రామాల నుంచి పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.కొట్టే.వెంకయ్య,చిరితోటి ఇందిరావతి,ఎంసుభాను, కందుకూరు ప్రాజక్టు అధ్యక్షకార్యదర్శులు రాజేశ్వరి, రహంతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి



**సీఎస్‌పురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు అని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. మంగళవారం కోవిలంపాడు గ్రామంలో ముస్లిం సోదరులకు గోను చంద్రశేఖర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కదిరిబాబురావు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి పార్థసారథి, సర్పంచ్ షేక్ ఖాదర్‌బి బుజ్జి, ఇరగని చలపతిరావు, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్, షేక్ అహమ్మద్, ఏలిక నాగేశ్వరరావు, షేక్ నాయబ్ రసూల్, నున్నా నారాయణ, ఎన్.శ్రీనివాసులు, ఇమామ్ హుస్సేన్, సుభాని, గోపి, జైలా, నాగూర్, కొట్టె శ్రీను, గోను రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు పిఓ ఉద్యోగం సాధించిన నేతాజీ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి

### - కర్ణాటక గ్రామీణ బ్యాంక్‌లో అంజి నాయక్ ఎంపిక



**మార్కాపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణానికి చెందిన నేతాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ (నైస్)లో శిక్షణ పొందిన దుమావత్ అంజి నాయక్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ నిర్వహించిన ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బి) ప్రొబేషనరీ ఆఫీసర్ (పిఒ) తుది ఫలితాల్లో ఎంపికయ్యారు. ఆయనకు కర్ణాటక గ్రామీణ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా నియామకంలభించింది. సోమవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో (రోల్ నం: 1824004315) అంజి నాయక్ ఎంపికైనట్లు సంస్థ గౌరవ సలహాదారు కాశిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అంజి నాయక్ మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుల బోధన విధానం తన విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా అర్థమెటిక్, రీజనింగ్‌లో తారక్,కాశిరెడ్డి అందించిన షార్ట్‌కట్ పద్ధతులు,స్పీడ్ మ్యాథ్స్ ట్రిక్స్ ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు.అభినందన కార్యక్రమంలో తారకబ్రహ్మం, శేషు, గౌతమ్, ఫణికుమార్, ఫణీంద్రరెడ్డి, వీరభద్రారెడ్డి, రమణారెడ్డి, రాజశేఖర్,వెంకటేశ్వరనాయక్, గణేష్ తదితరులు పాల్గొని అభినందించారు. స్థానికంగా శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీ పరీక్షలో విజయం సాధించిన అంజి నాయక్ ఇతర అభ్యర్థులకు ఆదర్శంగా నిలిచారు.

## మార్కాపురం సబ్ జైలు తనిఖీ

### - ఖైదీలతో మాట్లాడిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్



**మార్కాపురం, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మార్కాపురం సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ (డిఎల్ఎస్ఏ) సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విచారణ ఖైదీలు మరియు వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను వ్యక్తిగతంగా కలుసుకుని వారి కేసుల వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. తరువాత నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ దేవుడు ఇచ్చిన మానవ జన్మకు మంచిని,చెడును గ్రహించే విచక్షణ జ్ఞానం అవసరమని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలు ఉండాలని,అవి దెబ్బతిన్నప్పుడు సమాజంలో శాంతి భద్రతలు క్షీణిస్తాయని అన్నారు. ఆవేశం, నిగ్రహం కోల్పోవడం వలనే చాలా మంది నేరాలకు పాల్పడుతున్నారని, ఫలితంగా కుటుంబాలను కోల్పోతున్నారని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, అతిక్రమించరాదని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల వినియోగం యువత ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని, ఇంద్రియ నిగ్రహం లేకపోవడం నేరాలకు దారితీస్తోందని పేర్కొన్నారు. చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది చెడు అలవాట్లను విడిచిపెట్టి పటిష్టమైన కుటుంబ వ్యవస్థను నిర్మించుకోవాలని ఖైదీలకు సూచించారు. అలాగే బెయిల్, అరెస్టు విధానాలు మరియు ఉచిత న్యాయ సహాయం హక్కులపై అవగాహన కల్పించారు. జైలులో విచారణ ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, ఆహార నాణ్యతపై సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లాయర్లు ఎం అన్వర్ బేగ్, ఎస్‌కే జాహీర్ సలామ్, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం విజయ్ కుమార్, పిఎల్‌వి షేక్ బాషా, కోర్టు సిబ్బంది మరియు జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార సంఘాల ఉద్యోగుల వినూత్న నిరసన

### - మోకాళ్లపై కూర్చొని ఖాళీ ప్లేట్లతో నినాదాలు



**మార్కాపురం, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్కాపురం పట్టణంలోని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని ఖాళీ ప్లేట్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల నిరక్ష్య వైఖరి అవలంబిస్తున్నందుకు నిరసనగా సమ్మె బాట పట్టినట్లు వారు తెలిపారు. రాష్ట్ర జెఏసి నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులకు జిఓ 36 అమలు చేయాలని, 2019, 2024 పిఆర్‌సిలు మంజూరు చేయాలని, లేకపోతే కనీసం 50% తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.2 లక్షల గ్రాట్యుటీ సీలింగ్‌ను ఎత్తివేసి చట్టం ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. 2019 తర్వాత నియమితులైన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచాలని, సంఘాల లాభ నష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదనంగా రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెతో పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డికెయం రఫీ, సహకార సంఘ ఉద్యోగుల సంఘం నాయకులు పిఎల్ రంగయ్య, ఎర్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చాంద్‌బాషా, శేషిరెడ్డి,సయ్యద్ అహ్మద్, షైక్ మహబూబ్ బాషా, ముల్లా మహమ్మద్ రఫీ, అనుమాలశెట్టి రాజేష్, దుద్దెల మల్లికార్జునరెడ్డి, గుత్త పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సభకు తరలిరావాలి



**రాచర్ల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లాలో నేడు జరిగే ముఖ్యమంత్రి సభకు మండలం నుంచి ప్రజలు స్వచ్ఛంధంగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కె యోగానంద్ పిలుపునిచ్చారు.మండలంలోని యడవల్లి ,గుడిమెట్ట, ఒద్దులవాగుపల్లి, సోమిదేవిపల్లి, తదితర గ్రామాల్లో గ్రామంలో మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించి చంద్రబాబు సభ గురించి ప్రజలకు వివరించి సభ విజయవంతానికి సహకరించాలని కోరారు. నూతన జిల్లా ఏర్పాటు, దాని అభివృద్ధితోపాటు, పశ్చిమ ప్రాంతానికి ఆక్సిజన్ లాంటి వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం ఫీడర్ కెనాల్ శంకుస్థాపన కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమాలు మార్కాపురం జిల్లా ప్రగతికి సోపానాలు లాంటివని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలకు అందరం చేయూతనిచ్చి సహకరించాలని, సభకు స్వచ్ఛందంగా తరలివెళ్దామని అన్నారు. కార్యక్రమంలో రామాపురంసొసైటీ బ్యాంక్‌చైర్మన్ భవనంపుల్లారెడ్డి,నాయకులు కళ్యాణ్‌రెడ్డి,గోపి,తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

### - హౌసింగ్ డిఈ షేక్ ఖదీర్ భాష



**రాచర్ల, ఫిబ్రవరి 24 ,ప్రభాతవార్త**

గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేస్తేనే బిల్లులు ఇవ్వడం జరుగుతుందని గిద్దలూరు గృహ నిర్మాణ శాఖ డిఈ షేక్ ఖదీర్ భాష తెలిపారు. మండల కేంద్రమైన రాచర్లలో నిర్మాణంలో ఉన్న గృహాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు ఏ దశలో ఉన్నా వాటిని ఉగాది నాటికి పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసే విధంగా ప్రభుత్వం సంకల్పించిందన్నారు.కాబట్టి లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తిచేసుకుని ఉగాది రోజు గృహప్రవేశాలు చేయాలన్నారు. నిర్మాణాలు ఏ దశలో ఉన్న అయిన వాటికి అయినట్లు బిల్లులు చెల్లిస్తామని బిల్లులో ఎలాంటి జాప్యం ఉండదని అన్నారు. ప్రస్తుతం 66 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని త్వరగా చేయాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణాలు ఆగిపోయిన వారు వెంటనే పునర్నిర్మాణాలు చేపట్టాలని ఆయన కోరారు. ఆయన వెంట రాచర్ల ఏఈ పోలయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నబాబు తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు అల్పాహారం పంపిణీ




**కంభం, ఫిబ్రవరి 24 ,ప్రభాతవార్త**

కంభం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు తన్నీరు బాల రంగారావు, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్ ఆర్థిక సహకారంతో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినీలకు మంగళవారం అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది ఈ పాఠశాల విద్యార్థినిలు టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా ట్రిపుల్ ఐటీ నందు అత్యధిక సీట్లను సాధించడంతో ఇక్కడ విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు క్లబ్ అధ్యక్షులు పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం స్టడీ అవర్ నందు విద్యార్థులకు అల్పాహరాన్ని ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి అమూల్య, లైన్స్ సర్వీస్ ప్రోగ్రాం చైర్మన్ సయ్యద్ జాకీర్, కోశాధికారి పి గుండయ్య, ఎన్ కేశవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వపథకాలు సద్వినియోగం చేసుకోండి

### - మహిళా సమావేశంలో ఏపీఎం సురేష్



**కందుకూరు ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

పొదుపు మహిళల జీవనోపాధులకు ప్రభుత్వం రాయితీకూడిన పలు పథకాలు అందిస్తుందని కందుకూరు ఏపీఎం టి.సురేష్ తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన మహిళలకు విజ్ఞప్తిచేశారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలస్థాయి మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన పలు పదకాలను వివరించారు. పీఎమ్ఈజీపీ, పీఎంజీవై తదితర పదకాలు మహిళాభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు. సీసీ అనిత మాట్లాడుతూ ఫుడ్అండ్ న్యూట్రిషయన్ పథకం వలన గలిగే లాభాలను వివరించారు.ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ డిఆర్‌పీ బానుచందర్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్‌రంగంలో పరిశ్రమ స్థాపించాలంటే 35శాతం రాయితీకూడిన రుణం అందిస్తామన్నారు.లబ్దిదారుడి వ్యాపారాభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు కల్పిస్తామన్నారు.సాంకేతిక శిక్షణ, మార్కెటింగు సౌకర్యం తదితర అంశాలలో తమ సిబ్బంది సహాయసహకారాలుంటాయిని ఆయన వివరించారు.ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు.

## ఉత్తమవిద్య,ఆరోగ్యమే నారాయణ సంస్థల లక్ష్యం

### - నారాయణలో మంగళవారం వైద్యశిబిరం



**కందుకూరు ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

నారాయణ విద్యాసంస్థలో ఉన్నత విద్యతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తున్నట్లు నారాయణ క్లస్టర్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపల్ అనీస్ భాను ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ క్యాంప్‌లో ఎల్.వి ప్రసాద్ వైద్యశాల కంటి వైద్యనిపుణులు డాక్టర్ సల్మాన్ ఖాన్, కృష్ణ సాయి హాస్పిటల్ నుండి దంత వైద్యనిపుణులు డాక్టర్ పొట్టేళ్ల మనోజ్, సురక్ష వైద్యశాల, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్తిలు పాల్గొన్నారు.విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ శారీరక ఆరోగ్య ప్రభావం విద్యాభ్యాసంపై ఉంటుందన్నారు.ప్రదానంగా కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.మనం తినేఆహారపదార్థాలే పలు అనారోగ్యసమస్యలకు మూలమన్నారు. వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.నారాయణ సంస్థల్లో గైనకాలజిస్ట్ నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ అనీస్ భాను మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో విద్యతోపాటు ఆరోగ్యానికి అధికప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ఉత్తమ శిక్షణ, క్రమశిక్షణ.విద్య, ఆరోగ్యం అందించటమే నారాయణ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ మస్తానయ్య, ప్రశాంత్, అకాడమిక్ డీన్ జానీ, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీలక్ష్మి, తేజస్విని,ఏఎన్ఎం శైలజ, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన

### - విద్యుత్ సబ్‌స్టేషన్‌పై అవగాహన




**కందుకూరు ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

కందుకూరు పట్టణ జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం క్షేత్రస్థాయి విద్యాబోధన చేపట్టారు.ఎలెక్ట్రానిక్ ట్రేడ్ విద్యార్థులు వృత్తివిద్యలో భాగంగా ప్రత్యక్ష అవగాహన నిమిత్తం పట్టణంలోని కోవూరు రోడ్‌లో గల 132/33 కెవిసబ్‌స్టేషన్ సందర్శించారు.పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఇన్‌స్ట్రక్టర్లు ట్రైనర్ ప్రతాప్ రెడ్డి మరియు ప్రసాద్‌లు పనితీరుపై అవగాహన కల్పించారు.సమగ్రశిక్ష విభాగం ఆధ్వర్యంలో ట్రాన్స్ ఫార్మర్ల పని విధానం,విద్యుత్ సరఫరా విధానం, హై వోల్టేజ్ మరియు లో వోల్టేజ్ లైన్ల నిర్వహణ, భద్రతా నియమాలు వంటి అంశాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం యం.నరసింహమూర్తి,ఇంచార్జి హెచ్‌ఎం రమణయ్య మరియు స్టాఫ్ సెక్యూరిటీ చిత్తారి వెంకటేశ్వర్లు చేపట్టారు.ఈ కార్యక్రమంలో సబ్‌స్టేషన్ అసిస్టెంట్ మెయింటెన్ ఇంజనీర్ యం.శోభారాణితోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## 2వ రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరసన

### - నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం తప్పదంటున్న నేతలు



**కందుకూరు ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**

అంగన్‌వాడి సిబ్బంది సమస్యలను నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తగిన మూల్యం చెల్లించాల్సివస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం ఏమైందో గుర్తు చేసుకోవాలని ఆయన పాలకులకు సూచించారు.సమస్యల పరిష్కారం నిమిత్తం కందుకూరు ప్రాజక్టులోని కందుకూరు,వలేటివారిపాలెం మండలాల వర్కర్లు కందుకూరులోనూ, ఉలవపాడు ప్రాజక్టులోని ఉలవపాడు, లింగసముద్రం,గుడ్లూరు మండలాల సిబ్బంది ఉలవపాడులోనూ నిరసన చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం 2వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల సీఐటీయూ నాయకులు జి.వెంకటేశ్వర్లు, జవిబి.కుమార్,గౌస్ తదితరులు పాల్గొని తమ సంఘీబావం ప్రకటించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీసవేతనం 26వేలు పెంచాలని,హెల్పర్ల ప్రమోషన్ల విషయంలో రాజకీయ జోక్యం తగ్గించాలని, మే నెలలో వేసవి సెలవులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కారిస్తామని కూటమి ప్రభుత్వం నేతలు ఆనాడు శిబిరం దగ్గరకు వచ్చి వాగ్దానంచేశారన్నారు.నేడు వారంతా ఎమ్మెల్యేలు,మంత్రులుగా కొనసాగుతూ ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని ఆరోపించారు.ఇదే పరిస్థితి కొనసాగితే గత ప్రభుత్వం పరిస్థితి పునరావృతం అవుతందున్నారు.

## శనగరైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

### - అంబవరం, వెల్లుపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో విజయభాస్కర్ రెడ్డి

**గిద్దలూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మండలంలోని అంబవరం, వెల్లుపల్లి గ్రామాలలో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శనగలకు మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నందున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5875గా ఉందని తెలిపారు. కావున శనగ పంట వేసిన రైతులు తమ గ్రామ రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్‌తో సమగ్ర వ్యవసాయ ధరలు, సేకరణ పర్యవేక్షణ (సిఎంఏపిపి) యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.ప్రభుత్వం నుంచి కొనుగోలు షెడ్యూల్ అందుతుందని, కొనుగోలుకు తీసుకువచ్చే పంట గింజలు నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండాలని, ముఖ్యంగా తేమశాతం14% లోపు ఉండాలని రైతులకు తెలియజేశారు.ప్రభుత్వంతో వచ్చే వివిధ పథకాలు అయిన పీఎంకిసాన్,అన్నదాత సుఖీభవ, విత్తనాలు,ఎరువులు, ఇతర వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలు పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడి కలిగి ఉండాలని సూచించారు. ఈ ఐడి లేనివారు తమ గ్రామంలోని గ్రామవ్యవసాయ, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ సహాయకులను సంప్రదించి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు హనుమంతరెడ్డి,వరలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.



## ముద్రణ రంగానికి కొత్త దిశ

### - మార్కాపురంలో 21 మండలాల ప్రింటర్స్ మహాసభ





**మార్కాపురం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్, నరసరావుపేట, మురళీ ఆఫ్సెట్ ప్రింటర్స్ జమ్ముల రాధాకృష్ణమూర్తి, స్టేట్ ప్రింటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు కాకుమాను వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీ, ప్రత్యేక సమావేశం జిల్లా ముద్రణ రంగ చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. ఉదయం కోర్టు సెంటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీలో జిల్లాలోని 21మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు, సిబ్బంది, సంఘ ప్రతినిధులు పాల్గొని ఐక్యతను ప్రదర్శించారు. ర్యాలీతో పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ర్యాలీ అనంతరం మార్కాపురం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ముద్రణ రంగ పితామహుడు జోహాన్స్ గూటెంబర్గ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రపంచ విజ్ఞాన వ్యాప్తికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ముద్రణ రంగ అభివృద్ధిలో ఆయన పాత్రను నాయకులు విశేషంగా కొనియాడారు. తదుపరి సమావేశంలో జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ బలోపేతం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం, ప్రభుత్వ సహకారం,యువతకు ఉపాధి అవకాశాలు, నాణ్యత ప్రమాణాలు, మార్కెట్ పోటీ పరిస్థితులపై విస్తృత చర్చలు జరిగాయి.సంఘటితంగా పనిచేస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని యాజమానులు తీర్మానించారు. జిల్లాలోని అన్ని మండలాల ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు ఒకే వేదికపై సమావేశమవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రింటింగ్‌రంగ అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

## సుబ్బరాయుడు ఆశయ సాధన కోసం పున్నరకితమవుదాం

### - సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవండ్ల శ్రీనివాస్



**త్రిపురాంతకం, ఫిబ్రవరి 24,ప్రభాతావార్త**

గాలి సుబ్బరాయుడు గారి పదవ వర్ధంతి కార్యక్రమాన్ని మండలకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవీ కృష్ణ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవండ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై సుబ్బరాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బరాయుడు గారు విద్యార్థి దశ నుంచి అంకితభావం కలిగి పేదల పట్ల విశ్వాసం కలిగినవాడని ఉపాధ్యాయ వృత్తి చేస్తూ కీలకంగా పార్టీ కోసం పని చేశారని, పూల సుబ్బయ్య రావులపల్లి చెంచయ్య వారితో కలిసి తిరిగిన అనుభవం ఉందని అనేక పోరాటాలలో పాల్గొన్నారని వారన్నారు. అంతేకాకుండా గాలి సుబ్బరాయుడు సహకార సొసైటీ డైరెక్టర్గా మంచి మెజారిటీతో గెలుపొందారని ఎర్రగొండపాలెం ఏరియా కార్యదర్శిగా పనిచేశారని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంలో రైతాంగ సమస్యల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని, వారు లేకపోయినా వారు ఏ లక్ష్య సాధన కోసం పనిచేశారో, సుబ్బరాయుడు ఆశయ సాధన కోసం పునరాంకితమై, అయన ఆశయాలను కొనసాగుస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఎర్రగొండపాలెం నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో వారి సతీమణి గాలి లక్ష్మీరాజ్యం, త్రిపురాంతకం పట్టణ కార్యదర్శి ఎస్‌కె ఖాశిం, ఎన్ఎస్పి శాఖ కార్యదర్శి సి పవన్ కుమార్, గురవయ్య, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్వల్ప అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న

## రాఘవేంద్రకు ఎమ్మెల్యే ముత్తుముల పరామర్శ



**గిద్దలూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన బొర్రా రాఘవేంద్ర స్వల్ప అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రాఘవేంద్ర త్వరగా కోలుకుని మళ్లీ కార్యాచరణలో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఇబ్రహీం షరీఫ్



**గిద్దలూరు, ఫిబ్రవరి 24 ,ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ గిద్దలూరులోని సబ్ జైల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ప్రతి ఖైదీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేర ప్రవృత్తి మంచిది కాదని, బాధ్యత కలిగి మంచి పౌరులుగా మెలగాలని సూచించారు. తెలిసి చేసినా, తెలియక చేసినా నేరం నేరమేనని స్పష్టం చేశారు. బెయిల్ పొందిన వారు, విడుదలైన వారు, విచారణ ఖైదీలు తమ కేసులు పూర్తయ్యే వరకు ప్రతి వాయిదాకు కోర్టు ముందు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ప్రవర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా అరెస్టు, బెయిల్, సింగిల్ షూరిటీ, ఉచిత న్యాయ సహాయం అంశాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందిస్తున్న వసతులు, ఆహార పదార్థాలు మరియు సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఏ ఖాదర్‌భాషా,లీగల్ ఎయిడ్ న్యాయవాది షేక్ ఫజిల్, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధరావు, జైల్లో ఉన్న ఖైదీలు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఒంగోలు నగరంలో మదిగలకు ఆరామ క్షేత్రం నూతన భవనంను నిర్మించాలి



**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

ఒంగోలు నగరంలో మాదిగలలో సొంత ఇల్లు లేని వారు, అనాథలు, నిరాశ్రయులు వారు చనిపోయినప్పుడు కర్మకాండలను నిర్వహించుకోవడానికి మాదిగలకు ప్రత్యేకంగా ఆరామ క్షేత్రంకు స్థలం కేటాయించి భవనాన్ని నిర్మించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ కోరారు. మంగళవారం అంబేద్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత ఇల్లు లేకుండా అద్దె ఇండ్లలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగాలతో పాటుగా కూలి పనులు చేసుకుని జీవన ఉపాధి చేసుకుంటూ ఉంటున్న వారు చనిపోయినప్పుడు కనీసం ఆ మృతదేహాన్ని కూడా అద్దె ఇంట్లోకి ఉండనీయకుండా ఉండటం మానవత్వానికి మాయని మచ్చలాగా తయారైందన్నారు. ఒంగోలు నగరంలో అద్దె ఇండ్లలో ఉండేవాళ్లు అశుభ కార్యక్రమాలు జరిగే సమయాలలో ఆ కుటుంబ సభ్యులు పడే బాధ వర్ణనాతీతంగా మారిందన్నారు. దీంతో పాటుగా పిల్లలు కూడా చూడకుండా వదిలేసిన తల్లిదండ్రులు, నిరాశ్రయులుగా మారి వారు మృతి చెందినప్పుడు కూడా ఇటువంటి పరిణామాలే ప్రతినిత్యం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వారిని ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ఆ కుటుంబ సభ్యులు వారం పాటు ఆరామ క్షేత్రాల్లోనే ఉండి కర్మకాండలు నిర్వహించుకొనే విధంగా ఆ భవనాలు ఉపయోగపడతాయన్నారు. హిందువుల మాదిరిగానే ఎస్సీలకు కూడా ఆరామ క్షేత్ర భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఒంగోలు నగరంలో ఓసీ, బీసీ కులాలలో ప్రతి కులానికి ఒక ఆరామ క్షేత్రం ఉందని అశుభాలు జరిగిన వేళలో ఆ క్షేత్ర భవనాలలో వారి వారి కార్యక్రమాలను కొనసాగించుకుంటూ ఉన్నారని, అదే విధంగా ఎస్సీలలో కూడా ఇటువంటి కర్మకాండలు సొంత ఇల్లు లేని వారు నిరాశ్రయులు, అనాథలు, మృతి చెందిన సమయాలలో ఆరామ క్షేత్ర భవనాలలో నిరాటకంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి ఆచారం ప్రకారం కార్యక్రమాలు జరుపుకునే విధంగా మాదిగలకు ప్రత్యేక ఆరామ క్షేత్రంకు స్థలం కేటాయించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నామని సుజన్ మాదిగ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీఎస్ ప్రతినిధులు గద్దె త్యాగరాజు,తేళ్ల జయరాజ్, బక్కా ఆనంద్, సురేష్,యాదవ జేఏసీ ఒంగోలు నగర అధ్యక్షులు దూళ్ళ అప్పారావు, ప్రకాశం జిల్లా సఫాయి మజ్దూర్, యూనియన్ అధ్యక్షుడు పొగడ్త నారాయణ తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 2/25/2026 12:22 AM Page 1



## ముఖ్యమంత్రి గారు మా విద్యార్థులను పట్టించుకోండి

### - అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి



**ఒంగోలు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
ఏబీవీపీ మార్కాపురం ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీలను ఏర్పాటు చేయాలి అలాగే మెడికల్ కాలేజీ పనులు మరల ప్రారంభించాలి. ఈ సందర్భంగా ఏబీవీపీనగర్ కార్యదర్శి పవన్ మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం వెనుక బడినటువంటి ప్రాంతమైన మా మార్కాపురంనీ జిల్లా చేసినందుకు ధన్యవాదాలు కానీ ఇక్కడ విద్యార్థులు చదువుకోవాలంటే ప్రైవేట్ ఇన్స్టిట్యూషన్ చుట్టూ తిరగాల్సి వస్తుంది ఎందుకనగా ఇక్కడ ఒక ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ,పీజీ కాలేజీలు లేకపోవడం ఎంతో దౌర్భల్యం ఎన్నో ఏళ్లుగా మేము అడుగుతున్నాం .ఇక్కడ ఒక ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలని కాని గత ప్రభుత్వం నిరక్ష్యం ధోరణి వల్ల ఇక్కడ ఎయిడెడ్ కళాశాలని మార్చి వేశారు ఇప్పుడు ప్రస్తుతం మార్కాపురంలో ఎటువంటి ప్రభుత్వ కళాశాల లేకపోవడం వల్ల పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక పోతున్నారు. అలాగే మార్కాపురంకి శాంక్షన్ అయినటువంటి మెడికల్ కాలేజ్ పనులు కూడా తిరిగి ప్రారంభించవలసినగా కోరుచున్నాము. దయచేసి మీ యొక్క ఈ పర్యటనలో ఆ విద్యార్థుల యొక్క కోరికలను నెరవేరుస్తారని భావిస్తున్నాము. లేనియెడల రాబోయే రోజులలో ఉద్యమానికి దారితీస్తుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గురునాథ్, జిల్లా SFDకన్వీనర్ నారాయణ, మార్కాపురం భాగ్ కన్వీనర్ రామకోటిరెడ్డి ఎబివిపి కార్యకర్త జీ.అశ్వత్థామ పాల్గొనారు.

## ప్రపంచ దేశాలతో సంబంధాలను మరింత పటిష్టం

**ఒంగోలు, ప్రభాతవార్త**
ప్రపంచ దేశాలతో సంబంధాలను మరింత పటిష్టం చేసే దిశగా భారత పార్లమెంట్ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా లోకసభ స్పీకర్ ఓం బిరా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్స్ పేరుతో ప్రత్యేక బృందాలను ప్రకటించారు. మొత్తం 60 దేశాలతో ద్వైపాక్షిక బంధాలను మెరుగుపరచడం, భారత ప్రజాస్వామ్య గొప్పతనాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పడమే ఈ బృందాల లక్ష్యం. ఇందులో భాగంగా ఇండియా- క్యూబా పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూప్ ప్రెసిడెంట్‌గా ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, దేశ ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి విదేశీ దౌత్యంలో పాల్గొనడం విశేషం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోని పార్లమెంటరీ పనితీరును, చట్ట సభల వ్యవస్థను ఇతర దేశాలకు వివరించడం, విదేశీ శాసనసభల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయడం, ఈ చొరువ వల్ల అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రభావం మరింత పెరుగుతుందని, ప్రపంచ దేశాల మధ్య సయోధ్య కుదురుతుందని, ఇది భారత విదేశాంగ విధానానికి పార్లమెంటరీ వ్యవస్థ ఇచ్చే అతి పెద్ద సహకారంగా నిలవనుందని మాగుంట తెలిపారు.

## తౌషిక్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

### - మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
సింగరాయకొండలో నవోదయ కోచింగ్ సెంటర్‌లో అనుమానస్పద రీతిలో మృతి చెందిన 11 ఏళ్ల విద్యార్థి తౌషిక్ ఘటనపై పోలీసులు, త్రిసభ్య కమిటీ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం పార్లమెంటరీ పరిశీలకులు కదిరి బాబురావు డిమాండ్ చేశారు. కనిగిరి పట్టణం 9వ వార్డుకు చెందిన సయ్యద్ అలీ కుమారుడు తౌషిక్, సింగరాయకొండలోని శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో చదువుతున్న సమయంలో ఇటీవల అనుమానస్పదంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కదిరి బాబురావు మంగళవారం కనిగిరిలోని బాలుడి నివాసానికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. బాలుడి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక విచారణ అధికారిగా నియమితులైన కందుకూరు సీఐ షేక్ అన్వర్ భాషాతో కదిరి బాబురావు మాట్లాడారు. బాలుడు మృతి చెంది పది రోజులు కావస్తున్నా పోస్టుమార్టం నివేదిక ఇంకా రాకపోవడంపై ప్రశ్నించారు. పేద కుటుంబానికి చెందిన బాలుడు విద్య కోసం కోచింగ్ సెంటర్‌కు వెళ్లి అనూహ్యంగా మృతి చెందడం ఆధాకరమని పేర్కొన్నారు. బాలుడి మృతిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, దోషులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని , బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు విచారణను వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ డిష్ జిలాని, పోలిచర్ల రహీం, డాక్టర్ నాయబ్ రసూల్, గౌస్ భాషా, నాగూర్ వలి, కరిముల్లా, సర్దార్, రషీద్, ముత్యాల ప్రతాప్, షేక్ షరీఫ్, ఫిరోజ్, నాగూర్ బి, మద్దిశెట్టి భారతి, మార్తల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాధిక నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న కదిరి బాబురావు

**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణానికి చెందిన పసుపులేటి హరేరామ సుబ్బారావు కుమార్తె రాధిక నిశ్చితార్థ వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు వారి నివాసానికి వెళ్లి రాధికను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఆయన వధువు రాధికను భవిష్యత్తు జీవితంలో సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, పి.దీప, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, షేక్ రహిమాన్, షేక్ రషీద్, బొట్టు శ్రీను, మార్తల రామిరెడ్డి, పి.అరునోధర్, ముత్యాల ప్రతాప్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తౌషిక్ కేసులో ఆలస్యం ఎందుకు..?

### - న్యాయం కోసం మానవ హక్కుల కమీషన్ వరకు పోరాటం

### - జేసీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించిన అబ్దుల్ గఫార్





**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
కనిగిరికి చెందిన సయ్యద్ అలీ కుమారుడు తౌషిక్ సింగరాయకొండ మండలం మూలగంటపాడులోని శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఆరోతరగతిచదువుతూఅనుమానస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై దర్యాప్తు వేగవంతం చేయాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్, న్యాయవాది అబ్దుల్‌గఫార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్కాపురం ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావును మంగళవారం మార్కాపురంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఘటనకు పది రోజులు గడిచినా కేసు విచారణలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 11 ఏళ్ల బాలుడు కోచింగ్ సెంటర్‌లో అనుమానస్పదంగా మృతి చెందడం చాలా విషాధకరం. తౌషిక్ తల్లిదండ్రులు ఇది హత్యేనని, తమ వద్ద సరిపడా ఆధారాలు ఉన్నాయని వాపోతున్నప్పటికి విచారణలో ఆలస్యం చేయడం సమంజసం కాదు అని అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. జేసీ శ్రీనివాసరావు స్పందిస్తూ కేసును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టి నిజనిజాలు వెలికితీయాలని, లేని పక్షంలో తౌషిక్ కేసును మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేసి కుటుంబానికి న్యాయం జరిగే వరకు రాజకీయాలకు అతీతంగా పోరాటం కొనసాగిస్తామని అబ్దుల్ గఫార్ స్పష్టం చేశారు. తౌషిక్ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

## 'జయహో చంద్రన్న- సాహో వెలుగొండ' కు దిరిశవంచలో ఇంటింటి ప్రచారం

### - ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో ప్రజలకు ఆహ్వానం



**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లాలో బుధవారం నిర్వహించనున్న 'జయహో చంద్రన్న- సాహో వెలుగొండ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కనిగిరి మండలం దిరిశవంచ గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఈ ప్రచార కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర భవన కార్మికుల చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సీనియర్ నాయకులు బాలు ఓబుల్‌రెడ్డి, గంగవరంపు నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, గంజికుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించి, భారీగా హాజరై విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. మార్కాపురం జిల్లా అభివృద్ధి, వెలుగొండ ప్రాజెక్టు సాధనలో నాయకత్వం వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతగాఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.

## నేడు మార్కాపురంలో జరిగే సీఎం సభను జయప్రదం చేయండి

### - మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
ఈనెల 25వ తేదీన మార్కాపురం పట్టణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరు కానున్నారని, నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ప్రజలు తరలిరావాలని పరిశీలకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం పొదిలి పట్టణంలో పొదిలి మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ప్రకటించిన జిల్లా ప్రదాత నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 25వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల సాయి బాలాజీ స్కూల్ ఎదురుగా నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని, సభ విజయవంతానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ ఎత్తున తరలి వెళ్లాలన్నారు. పొదుపు గ్రూపు మహిళలకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో ఈ ప్రాంత ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ముఖ్యమంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలియ జేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల టీడీపీ కన్వీనర్లు అంజిరెడ్డి, ముల్లా కుద్దుస్, పొదిలి ఏఎంసీ చైర్మన్ సయ్యద్ ఇమాంస, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, నాయకులు శ్రీనివాస రావు, కాటూరి పెద్దబాబు, కాటూరి చిన్నబాబు, శివాలయ చైర్మన్ ఒగ్గు వెంకట రామయ్య, మేగడ ఓబుల్‌రెడ్డి, రసూల్, భాష, పలువురు మైనార్టీ, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్విస్ కళాశాల ఉపాధ్యాయుడు హరిబాబుకి డాక్టరేట్

### - అభినందించిన యాజమాన్యం



**ఒంగోలు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ డిపార్ట్మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న మారుటూరి హరిబాబు డాక్టరేట్ అందుకున్నారు. విట్ చెన్నై యూనివర్సిటీ నుంచి ఆయన పీహెచ్ డీ పూర్తి చేశారు. పర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ ఇమేజ్ ఫ్యూజన్ యూజింగ్ జనరలైజ్డ్ ఫజ్జీ సెట్స్ అండ్ అడాప్టివ్ ఫ్యూజన్ స్ట్రాటజీస్ ఫర్ అనటామికల్ అండ్ ఫంక్షనల్ బ్రెయిన్ ఇమేజస్ " అనే టాపిక్ లో డాక్టర్ వెల్మతి జి పర్యవేక్షనలో రిసర్చ్ చేసి డాక్టరేట్ అందుకున్నారు. అనాటమికల్, ఫంక్షనల్ బ్రెయిన్ ఇమేజింగ్ పద్ధతులను సమన్వయం చేసి, మరింత స్పష్టమైన, సమాచారపూర్వకమైన బ్రెయిన్ ఇమేజ్ లను రూపొందించే మల్టీమోడల్ ఇమేజ్ ఫ్యూజన్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం ఈ పరిశోధన ముఖ్య లక్ష్యం. వైద్య విభాగంలో శస్త్రచికిత్స, చికిత్స ప్రణాళిక తదితర అంశాల్లో ఈ పరిశోధన కీలకంగా మారనుంది. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబును క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, క్విస్ కళాశాల సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్ తదితరులు పాల్గొని హరిబాబుకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏ.పి.ఆర్.టి.ఎఫ్ రాష్ట్ర అడ్హాక్ కమిటీ

### - ఎన్నిక మరియు జిల్లా కమిటీల నియామకం



**ఒంగోలు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
తిరుపతిలో జరిగిన రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ సమావేశం ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు ఎస్. ఆనంద నాయుడు గారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్‌కు రాష్ట్ర అడ్హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో రాష్ట్ర కన్వీనర్‌గా ఏ.సదాశివరావు, విజయనగరం, కోకన్వీనర్‌గా చంగల్రాయ్ మండడి చిత్తూరు గార్లను మరియు సభ్యులుగా ఏ.ఎస్ నాయుడు విశాఖపట్నం, బి. తిరుపతి రెడ్డి నెల్లూరు, ఎం.వి.ప్రసాదరావు గుంటూరు, పి.వి. సుబ్బారావు ప్రకాశం, ఎస్. ఎడ్విన్ జార్జి అనంతపురం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బి వెంకట్రావు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీలను రాష్ట్ర కమిటీ నియమించడం జరిగింది .ప్రకాశం జిల్లా అడ్హాక్ కమిటీకి కన్వీనర్‌గా ఏ. అమ్మయ్య ,కోకన్వీనర్లుగా పి. ఆంజనేయులు, వి. బాలాజీ గారలను, మార్కాపురం జిల్లా అడ్హాక్ కమిటీగా వై.శ్రీనివాసులు, కోకన్వీనర్ లగా డి.వెంకటేశ్వర్లు ,ఐ అనోజీ రావు గార్లను నియమించినారని వారు తెలిపారు. తదుపరి దిగువ తీర్మానాలు చేశారని కూడా తెలిపారు. 1)ఉద్యోగ విరమణ చేసిన రోజే పెన్షన్, గ్రాడ్యుటి, కమ్యూటేషన చెల్లించునట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి ,2)పి.ఆర్.సి. కమిటీని వెంటనే నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, 3)సిపిఎస్ రద్దు చేయాలని, 4)ఎలాంటి వివక్ష లేకుండా ఉపాధ్యాయులకు 1980 పెన్షన్ నిబంధనలు తో కూడిన పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ,5)అడిషనల్ పెన్షన్ 70 సంవత్సరాలు నిండిన వారికి పది శాతం ,75 సంవత్సరాల నిండిన వారికి 15!! అమలు చేయాలని, 6) కేంద్ర ప్రభుత్వంతో సమానంగా రిటైర్ అయిన ఉపాధ్యాయులకు 20 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలని 7), రిటైర్ అయిన ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న గ్రాడ్యుటీ, లీవ్ ఎన్క్యాష్మెంట్, 11వ పిఆర్సి బకాయిలు, అన్ని రకాల బకాయిలు వెంటనే మంజూరు చేయాలని 8), పెండింగ్లో ఉన్న నాలుగు విడతల డి.ఆర్. వెంటనే మంజూరు చేయాలని, 9) రిటైర్డ్ టీచర్స్ ఇ.హెచ్.ఎస్ స్కీమును సరళతరం చేయాలని, 10) హెల్త్ కార్డుపై ప్రభుత్వం గుర్తించిన వైద్య శాలల్లో అన్ని జబ్బులకు వైద్యం అందేటట్టు చర్యలు తీసుకోవాలని11), పదో నెంబర్ జీవో ప్రకారం పెన్షన్ ఆన్లైన్ విధానంలో లోపాలు గుర్తించటానికి అన్ని శాఖలు కాకుండా ఒకటి లేదా రెండు శాఖలకు మాత్రమే పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయ రాజుగారు, ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి, ఐఫియా చీఫ్ ఫ్యాట్రిన్ కె.సుబ్బారెడ్డి ,ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి. సత్యనారాయణ తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారని కూడా తెలిపారు.

## స్మశాన సమస్యపై ఆర్‌డిఓ, తహశీల్దార్‌లను కలిసిన మోదేపల్లి వాసులు





**అద్దంకి ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**
మండలంలోని మోదపల్లి గ్రామంలో స్మశాన సమస్య ఈ నెల 16వ తేదిన అనపర్తి ఆది శేషయ్య మరణించగా సమాధి కార్యక్రమం స్మశానంలోకి తీసుకువెళ్లగా అదే గ్రామానికి చెందిన అగ్రకులాలు మీకు స్మశానం ఇక్కడ లేదు ఇక్కడ పూడ్చి పెట్టడానికి మేము ఒప్పుకోము అని ఎస్సీ కాలనీ వాసులను అడ్డుకున్నారు. ఆ కార్యక్రమం రెండు కులాల మధ్య వివాదంగా మారి ఆ కార్యక్రమం జరిగింది. ఈ విషయం మోదపల్లి ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మార్పీఎస్ దృష్టికి తీసుకురావడం జరిగింది. మంగళవారం అద్దంకి మండల తహశీల్దార్, ఆర్డీఓలనుమోదేపల్లి గ్రామస్తులు ఎంఆర్‌పిఎస్ బృందం కలిసి వినత పత్రం అందజేశారు. తహశీల్దార్ సానుకూలంగా స్పందించారు, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆర్డీవో, తహశీల్దార్ సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు పూనూరు రమేష్ మాదిగ, అద్దంకి నియోజకవర్గం గౌరవ సలహాదారుడు పూనూరు నెహెమ్యా మాదిగ, అద్దంకి మండల అధ్యక్షుడు పాలు పోగు సుబ్బారావు మాదిగమోదేపల్లి గ్రామఅధ్యక్షుడుఅనపర్తిఎలమందరావు మోదపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబటిని పరామర్శించిన చింతలపూడి



**అద్దంకి ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ మంగళవారం మాజీ మంత్రి, కాపు నాయకులు అంబటి రాంబాబును గుంటూరులోని వారి నివాసం నందు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కాకాని రాధకృష్ణమూర్తి, వైసిపి నాయకులు తదితరులు వున్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన ఏర్పాట్లు

### - గంటవానిపల్లె వద్ద ముఖ్యమంత్రి ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు, కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి , ఎమ్మెల్యేలు





**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
ఈ నెల 25వ తేదీ బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్‌కెనాల్ పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేయుచున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, వివిధ శాఖల జిల్లాఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగొండ ప్రాజెక్టు కొత్తూరు వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి హెలికాప్టర్







### - రాయల్ రన్ విజయవంతం

**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం వెలుగొండ ప్రాజెక్టు కొత్తూరు వద్ద హెలిప్యాడ్ మైదానానికి మంగళవారం ముఖ్యమంత్రి హెలికాప్టర్ ట్రయల్ రన్ కోసం చేరుకుంది. 25వ తేదీ బుధవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారనేది తెలిసిందే. ముఖ్యమంత్రి రాకకు ముందుగా హెలికాప్టర్ ట్రయల్ రన్ చేస్తారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పర్యటనకు ముందుగా భద్రతా ప్రమాణాలు, ల్యాండింగ్ ఏర్పాట్లు, ప్రోటోకాల్ నిర్వహణను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ట్రయల్ రన్ సందర్భంగా హెలికాప్టర్ హెలిపాడ్ వద్ద సాఫీగా దిగింది. ట్రయల్ రన్‌విజయవంతంగా ముగిసింది. పోలీసులు, రెవెన్యూ, ప్రత్యేక భద్రతా దళాలు కలిసి భద్రతాఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన రోజు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. దానికి అధికారులు హెలిపాడ్ పరిసరాలలో పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల కదలికలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నారు. వైద్య బృందాలు, అగ్ని మాపక సిబ్బంది కూడా స్టాండ్ బైలో ఉంచారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయ వంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు.

## సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తాం

### - రిలే నిరాహార దీక్షలో అంగన్‌వాడీ వర్కర్స్



**వేటపాలెం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయు వేటపాలెం ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు రిలేనిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలను వేటపాలెం ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.ప్రమీల దండలు వేసి ప్రారంభించారు. ఈ దీక్షను ఉద్దేశించి సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఎం.వసంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గత ఐదు సంవత్సరాల నుండి వేతనాలు పెరగలేదన్నారు. గతంలో 45 రోజులు పాటు సమ్మె నిర్వహించగా సమ్మె ముగింపు సందర్భంగా గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామన్నారు. ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న కూటమి నేతలు ఆనాడు ప్రతిపక్షంలో ఉండి హామీ ఇచ్చారు. నేడు అధికారంలో ఉన్న నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కానిచో 2వ తేదీన విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు బ్యూల కుమారి, సులోచన, నిర్మల, జ్యోతి, నాగ జ్యోతి, పద్మావతి, లక్ష్మీ, ఆదిలక్ష్మీ, లత, కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## అసెంబ్లీని సందర్శించిన ఎన్‌ఆర్‌పీఎం బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు

**చీరాల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**
అమరావతిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను వీక్షించేందుకు బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం ఎన్‌ఆర్‌పీఎం బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు అసెంబ్లీని సందర్శించడం ఆనందంగా ఉందని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీచర్స్ హైమావతి, జైచంద్ర, విద్యార్థులను కలుసుకుని ముచ్చటించడం జరిగింది. విద్యార్థి దశ నుంచే రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం అత్యంత అవసరమని వారికి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు ఎలా పని చేస్తాయి. ప్రజల సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి అనే అంశాలను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాభావం, ప్రజా సేవ స్ఫూర్తి మరింత బలపడుతుందని స్పష్టంగా తెలియజేశారు. యువతే దేశ భవిష్యత్తు అని, ఉన్నత లక్ష్యాలతో క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.





**బుధవారం మధ్యాహ్నం అమరావతి సచివాలయం నందు ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్‌ని ఒంగోలు ఎమ్మెల్యే శ్రీ. దామచర్ల జనార్ధన్ రావు మర్యాదక పూర్వంగా కలవడం జరిగినది. నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై వారితో జనార్ధన్ చర్చించారు.**

